అధికారుల నిర్లక్ష్యం.. ప్రజలకు శాపం

- ఏళ్ల తరబడి కొనసాగుతున్న అభివృద్ధి పనులు
- టోలిచౌకీ-టూంబ్స్ రోడ్డు, అక్బర్‌పురా, గోల్కొండ ప్రాంతాల్లో రోడ్ల మధ్యలో భారీ గుంతలు
- ప్రమాదాలకు గురవుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



టోలిచౌకీ-టూంబ్స్ రోడ్డుపై పైపులైన్ కోసం తవ్వకాలు

గోల్కొండ: అధికారుల నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారింది. అభివృద్ధి పనులను కాంట్రాక్టర్లకు అప్పగించి అధికారులు చేతులు దులుపుకుంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. టోలిచౌకీ, నానల్‌నగర్ డివిజన్లలో రెండేళ్ల క్రితం పైపులైన్‌ల పనులు ప్రారంభమైయ్యాయి. ఈ పనులు సకాలంలో పూర్తి కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలు ప్రాంతాల్లో వరద నీటి పైపులైన్ పనులు జరుగుతుండగా మరికొన్ని ప్రాంతాల్లో డ్రైనేజీ పైపులైన్ పనులు జరుగుతున్నాయి. వరద నీటి పైపుల కోసం జరుగుతున్న తవ్వకాలు లోతుగా తవ్వుతున్నారు. ఈ గుంతలే ప్రజల ప్రాణాలు బలిగొంటున్నాయి.

ప్రమాదాలు జరుగుతున్నా పట్టదా..

మూడు నెలల క్రితం టోలిచౌకీ టూంబ్స్ రోడ్డులో ఓ పాదచారి రోడ్డు మధ్యలో ఉన్న గుంతలో పడి మృతి చెందాడు. ఈ ఘటన జరిగిన తర్వాత కూడా అధికారులు కళ్లు తెరవలేదు. అదే విధంగా ఎండీలైన్స్ చౌరస్తా నుంచి గోల్కొండ మోతీదర్వాజా వెళ్లే రోడ్డులో కూడా సుదీర్ఘ కాలంగా పైపులైన్ పనులు జరుగుతున్నాయి. టోలిచౌకీ, ఎండిలైన్స్, మెహిదీపట్నం, నానల్‌నగర్ తదితర ప్రాంతాల నుంచి మోతీదర్వాజా వెళ్లే వారు ఈ రోడ్డు గుండానే వెళ్తుంటారు. తవ్వకాల కారణంగా రోడ్లపై భారీ మట్టికుప్పలు పేరుకుపోయాయి. అదే విధంగా టోలిచౌకీ నుంచి ఎండిలైన్స్ చౌరస్తా వరకు పాత మిలట్రీ క్వార్టర్స్ వద్ద కూడా పైపులైన్ పనులు జరుగుతున్నాయి. ఇవి కూడా సకాలంలో పూర్తి కావడం లేదు.



రోడ్డుపై బురద, మురుగు నీరు

చిన్నపాటి వర్షానికే బురదమయంగా..

టోలిచౌకీ టూంబ్స్ రోడ్డులో జరుగుతున్న పైపులైన్ పనుల కారణంగా వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి వర్షానికే రోడ్లపై నీరు చేరి బురదమయంగా మారుతుంది. టోలిచౌకీ నుంచి టూంబ్స్ చౌరస్తా వెళ్లే వారు రోడ్డు అధ్వానంగా ఉండడంతో గత్యంతరం లేక షేక్‌పేట్ నాలా, శాతం చెరువు రోడ్డు గుండా గోల్కొండ వెళ్తున్నారు. అదే విధంగా టూంబ్స్ రోడ్డు, బంజారా దర్వాజాకు వెళ్లే వాహనాదారులు టూంబ్స్ రోడ్డు బాగా లేకపోవడంతో షేక్‌పేట్ నాలా నుంచి చుట్టూ తిరిగి వెళ్తున్నారు. టోలిచౌకీ టూంబ్స్ రోడ్డు అత్యంత రద్దీగా ఉండే రోడ్లల్లో ఒకటి. ప్రతినిత్యం వీఐపీలు కూడా ఈ రోడ్డు గుండా రాకపోకలు సాగిస్తుంటారు. అయినా కూడా అధికారులు ఈ పనులను సకాలంలో పూర్తి చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు.

అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారు..



సుదీర్ఘ కాలంగా జరుగుతున్న అభివృద్ధి పనులు అధికారులు బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రజల ఇబ్బందులను ఏమాత్రం పట్టించుకోవడం లేదు. జరుగుతున్న అభివృద్ధి పనులపై అధికారుల పర్యవేక్షణ ఉంటే పనులు సకాలంలో పూర్తి అవ్వడంతో పాటు పనుల్లో నాణ్యత ఉంటుంది.

– అశోక్‌కుమార్, అక్బర్‌పురా టోలిచౌకీ

శాస్త్రీయ కళా రూపాలను ప్రోత్సహించాలి



కళాకారులతో ఎంపీ ఆర్.కృష్ణయ్య తదితరులు

గన్‌ఫౌండ్రీ: శాస్త్రీయ కళా రూపాలను ప్రోత్సహించడం భవిష్యత్ తరాలకు ఎంతో అవసరమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో నృత్యమాల నాట్య కళా వెల్ఫేర్ సొసైటీ, సిరి ఆర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో బాసర సరస్వతి అమ్మవారికి సంగీత నృత్య నీరాజనం -2025 పేరిట నృత్య ప్రదర్శనలో వివిధ ప్రాంతాలకు చెందిన చిన్నారులు పాల్గొని కూచిపూడి, భరతనాట్యం, కథక్ వివిధ కళా రూపాల ప్రదర్శనను అద్భుతంగా ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ..నేటి పాశ్చాత్య ఆధునిక పోకడలలో శాస్త్రీయ కళా రూపాలు కనుమరుగవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కళా రూపాలను భవిష్యత్ తరాలకు అందించడంలో సాంస్కృతిక సంస్థల పాత్ర ఎంతో కీలకమన్నారు. అనంతరం పలువురు గురువులను ఘనంగా సన్మానించడంతో పాటు కళాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సరస్వతి ఉపాసకులు దైవాజ్ఞశర్మ, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు వీరేష్‌యాదవ్, ప్రముఖ కవి డాక్టర్ వేమూరి అనంతర రామకృష్ణ శర్మ, వేమూరి మంజుల, రామ్‌దేవ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



ఎగ్జిబిషన్‌లో పాల్గొన్న మహిళా సేన సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షురాలు సంధ్యలక్ష్మి

సుల్తాన్‌బజార్: మహిళా సాధికారతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అటల్ బిహారీ వాజ్‌పేయి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు కావ్య కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం అబిడ్స్‌లోని జయ ఇంటర్నేషనల్ హోటల్‌లో మహిళా సేన సేవా సమితి వ్యవస్థాపకు అధ్యక్షురాలు సంధ్యలక్ష్మి ఆధ్వర్యంలో ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..మహిళలు ఇంటి వద్ద తయారుచేసిన వివిధ ఉత్పత్తులను ఈ ఎగ్జిబిషన్‌లో పెట్టడం ఆనందదాయకమన్నారు. వివిధ రకాల వంటకాలు, వస్త్ర ప్రదర్శన, చేతితో తయారుచేసిన ఎంబ్రాయిడింగ్ దుస్తులు, వెదరుతో అల్లిన బుట్టలు, ఆరోగ్యానికి సంబంధించిన ఉత్పత్తులు, భూమిపై పెట్టుబడులు, బరువు తగ్గించడానికి మెలకువలు, వివిధ రకాల కాస్మోటిక్ ఈ ఎగ్జిబిషన్‌లో ఉన్నాయి. వీటన్నిటిని ఆమె మాజీ బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్, ఢిల్లీ అధికార ప్రతినిధి వేణుగోపాలచారి, అధ్యక్షురాలు కవితతో కలిసి తిలకించారు. అనంతరం నిర్వాహకులు వారిని ఘనంగా సన్మానించారు.

మోదీ హయాంలోనే భారత్ అన్ని రంగాల్లో అభివృద్ధి

అబిడ్స్: ప్రధాని మోదీ హయాంలోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి దాల్చిందని గోషామహల్ కార్పొరేటర్ లాల్‌సింగ్ పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం 11 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా వీక్షిత్ భారత్ కా అమృత్‌కాల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గోషామహల్‌లో పలువురికి ఆయన మోదీ ప్రభుత్వ పథకాలను వివరించారు. అనంతరం మాట్లాడుతూ.. గోషామహల్ డివిజన్‌లో ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తెస్తే వెంటనే పరిష్కారం చేస్తామన్నారు. కమల్ సింగ్, ఉదయ్ సింగ్, రోహిత్ జవహరి పాల్గొన్నారు.



గంగపుత్ర సంఘం బలోపేతానికి కృషి



కొత్తగా ఎన్నికైన కమిటీ వారితో సంఘం సభ్యులు

గోల్కొండ: గంగపుత్ర సంఘం బలోపేతానికి, సంఘం సభ్యుల అభ్యున్నతికి అందరి సహకారంతో కృషి చేస్తానని షేక్‌పేట్ గంగపుత్ర సంఘం కొత్త అధ్యక్షుడిగా ఎన్నికైన గుర్రం నాగరాజు అన్నారు. ఆదివారం షేక్‌పేట్ గంగపుత్ర కమ్యూనిటీ హాల్‌లో సంఘానికి నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుర్రం నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా చెర్క గణేష్, ఉపాధ్యక్షుడిగా వి.ప్రభాకర్, వి.మహేందర్, జి.పరమేశ్వర్, సలహాదారులుగా సి.సదానంద్, జి.గోపాల్, పూస వేణుగోపాల్‌రావు, లక్ష్మణ్ ఎన్నికయ్యారు.

బంగారు బోనానికి పూజ



గోల్కొండ: గోల్కొండలోని జగదాంబిక మహంకాళి అమ్మవారికి సేవ చేయడం నా అదృష్టమని ఆలయ వృత్తిపని సంఘం మాజీ అధ్యక్షుడు బి.సాయిబాబాచారి అన్నారు. సాయిబాబాచారి కుటుంబం తరఫున ఈ నెల 26న మొదటి బోనం పూజ సందర్భంగా అమ్మవార్లకు సమర్పించనున్న బంగారు బోనానికి ఆదివారం రిసాలబజార్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..వంశపారపర్యంగా అమ్మవారికి పూజలు చేస్తున్నామన్నారు. అమ్మవారిపై ఉన్న భక్తితో తమ కుటుంబం తరఫున మొదటిసారిగా బంగారు బోనం అమ్మవారికి సమర్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మహంకాళి ఆలయ పూజారి బి.సురేష్‌చారి, శివాచారి, వృత్తిపని సంఘం ఉపాధ్యక్షుడు బి.శ్రీకాంత్ తదితరులున్నారు.

విజయవంతంగా మోదీ 11ఏళ్ల పాలన



ప్రదర్శనకు హాజరైన ఉమా మహేందర్, ప్రమోద్‌కుమార్ గోపిశెట్టి

జియాగూడ: దేశ ప్రధాని నరేంద్ర మోదీ 11 ఏళ్ల పాలన విజయవంతంగా కొనసాగుతుందని గోల్కొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఉమా మహేందర్ అన్నారు. ఆదివారం మంగళ్‌హాట్‌లో బీజేపీ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ పాలనపై ఏర్పాటైన ప్రదర్శన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఓబీసీ కార్యవర్గ సభ్యుడు ప్రమోద్ కుమార్ గోపిశెట్టి, గోల్కొండ జిల్లా కన్వీనర్ దీపక్ కుమార్, కో కన్వీనర్ శైలేందర్‌యాదవ్, వెంకటేష్, ఇంద్రసేనారెడ్డి, అక్షయ సాహు మోహన్‌గౌడ్, నితిన్ నందకర్ పాల్గొన్నారు.

కొమురవెల్లి మల్లికార్జున స్వామికి పట్టు వస్త్రాల అందజేత



పట్టు వస్త్రాలు అందజేస్తున్న మధుసూదన్ యాదవ్, సునీత దంపతులు

చార్మినార్: భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు, పాతబస్తీ హరిబౌలికి చెందిన మల్యాల మధుసూదన్‌యాదవ్, సునీత దంపతులు కొమురవెల్లి మల్లికార్జున స్వామితో పాటు అమ్మవార్లకు పట్టు వస్త్రాలను సమర్పించేందుకు ఆలయం ప్రాంగణంలో తయారు చేయించారు. వీటిని ఆదివారం కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవస్థానం ఈఓ అన్నపూర్ణ, అడిషనల్ ఈఓ శ్రీనివాస్‌కు అందజేశారు. మల్యాల మధుసూదన్‌యాదవ్ కుమారుడు హరేంద్రయాదవ్ జన్మదిన వేడుకల సందర్భంగా పట్టు వస్త్రాలు సమర్పిస్తానని చేసిన మొక్కులో భాగంగా అక్కడే తయారు చేయించి ఈఓకు అందజేసినట్లు మధుసూదన్‌యాదవ్ తెలిపారు. వీటిని సోమవారం ప్రత్యేక పూజలతో స్వామి వారితో పాటు అమ్మవార్లకు ధరింపచేయనున్నారన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తా



తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను సత్కరిస్తున్న ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్: చుడిబజార్‌లో పెండింగ్‌లో ఉన్న మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ పనులు పూర్తి చేయించేందుకు కృషి చేస్తానని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ హయాంలోనే గోషామహల్ నియోజకవర్గం నలుమూలలా అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. నియోజకవర్గం బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్‌గౌడ్ తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను ఆదివారం కలిసి సత్కరించి వినతిపత్రం అందజేశారు. మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ పనులు పూర్తి చేయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ..జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, హైదరాబాద్ కలెక్టర్ దాసరి హరిచందనతో మాట్లాడి పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాదిగ బంధుమిత్రుల సేవా సంఘం ప్రతినిధులు సుమన్‌కుమార్, వెంకటేష్, ధినేష్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

కష్టపడి పని చేసే వారికే పార్టీలో గుర్తింపు



మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న మిత్ర కృష్ణ తదితరులు

గోల్కొండ: కష్టపడి పని చేసే వారికే పార్టీలో గుర్తింపు లభిస్తుందని రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ఆదివారం కాంగ్రెస్ నియోజకవర్గం కాంగ్రెస్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే మిత్ర కృష్ణ ఆయనను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీలో తన ప్రస్థానం ఎన్‌ఎస్‌యూఐ నుంచి మొదలైందని అంచలంచలుగా పార్టీలో ఎదుగుతూ నేడు మంత్రి అయ్యానన్నారు. పార్టీలో కష్టపడి పని చేసే వారికి గుర్తింపు లభించడం ఖాయమని తన విషయంలో తనకు ముమ్మాటికి నిజమైందన్నారు. మంత్రిని కలిసిన వారిలో మిత్ర అభిషేక్, విజయ్, ఉమేష్ తదితరులున్నారు.

రామకృష్ణ శాస్త్రికి జాతీయ యోగా రత్న అవార్డు



రామకృష్ణ శాస్త్రికి అవార్డును అందజేస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

అబిడ్స్: ప్రముఖ యోగా గురువు బోయిన రామకృష్ణ శాస్త్రికి తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో జాతీయ యోగా రత్న అవార్డు–2025 ప్రదానం చేశారు. కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ఆయనకు అవార్డు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా రామకృష్ణ శాస్త్రి మాట్లాడుతూ..ఆరోగ్యం పదిలంగా ఉండేందుకు ప్రతి ఒక్కరూ యోగా తప్పనిసరిగా చేయాలన్నారు. భారతదేశంలో పుట్టిన యోగాను ప్రపంచంలోని పలు దేశాల్లో కోట్లాది మంది ఆదరిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర కోఆర్డినేటర్ వేణుగోపాల్, సోనియా, ఎం.శ్యామ్ రాజ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



పోటీల్లో గెలుపొందిన మహిళలు, యువతులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న దృశ్యం

జియాగూడ: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని మంగళ్‌హాట్ కార్పొరేటర్ శశికళ కృష్ణ అన్నారు. ఆదివారం మంగళ్‌హాట్‌లోని ముస్తయిద్‌పురా కుమ్మరివాడి మున్నూరుకాపు సంఘం ద్వారా బ్యామినో కంపెనీ వారి సౌజన్యంతో సీతారామాంజనేయస్వామి దేవస్థానం శ్రీరామ హిల్స్ గుట్టమీద మహిళలు, యువతులకు ముగ్గులు, ఆటల పోటీలను నిర్వహించారు. బీజేపీ సీనియర్ నాయకురాలు అరుణజ్యోతి, జిల్లా ఉపాధ్యక్షురాలు బండారు రాధిక, మున్నూరు కాపు సంఘం స్పోర్ట్స్, గేమ్స్ సెక్రెటరి తోట శ్రవణ్‌కుమార్ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మ్యాడం రమేష్ కుమార్, కార్యదర్శి ప్యాట కృష్ణదాస్, మహిళా అధ్యక్షురాలు ప్యాట పద్మ, కోశాధికారి ప్యాట రాఘవదాస్, మహిళా కార్యదర్శి ఆకుల అర్చన, ఆకుల నర్సింగ్‌రావు, ప్యాట హనుమాన్ దాస్ పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

మరో ఇద్దరి పరారు

నాంపల్లి: గంజాయి విక్రయిస్తున్న ఓ ఇంటిపై ఎస్‌టీఎఫ్ పోలీసులు దాడులు చేశారు. ఈ దాడిలో ఒకరిని అరెస్టు చేయగా మరో ఇద్దరు పరారయ్యారు. అరెస్టు చేసిన వారి నుంచి 1.138 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఈ ఘటన నాంపల్లి ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మాన్గార్ బస్తీలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... మాన్గార్ బస్తీలో గంజాయి విక్రయిస్తున్నట్లుగా సమాచారం రావడంతో దాడులు చేసినట్లు ఎస్‌టీఎఫ్ టీమ్ లీడర్ సంద్యాల అంజిరెడ్డి తెలిపారు. ఈ కేసులో కాంబ్లే అరుణ్ అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు వివరించారు. సాకేత్ రాజు, ఖలీద్ అనే మరో ఇద్దరు పరారైనట్లు తెలిపారు. నిందితుడిని నాంపల్లి ఎక్సైజ్ పోలీసులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

టింబర్ మర్చంట్స్ సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న డాక్టర్ సువర్ణ

నాంపల్లి: ది ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ టింబర్ మర్చంట్స్ సా మిల్లర్స్ అలైడ్ ఇండస్ట్రీస్ నాల్గవ సర్వసభ్య సమావేశం ఆదివారం రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్ హౌస్ కేఎల్‌ఎన్ ప్రసాద్ ఆడిటోరియంలో జరిగింది. టింబర్ మర్చంట్స్ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ రమణయ్య అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర అటవీ శాఖ పీసీసీఎఫ్ (హెచ్ఓఎఫ్ఎఫ్) డాక్టర్ సి.సువర్ణ ఐఎఫ్‌ఎస్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. టింబర్ మర్చంట్స్ సమస్యలను పరిష్కరించేందుకు శాయాశక్తుల కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే శాఖపరమైన ఉత్తర్వులు, ఉత్తర ప్రత్యుత్తరాలను మాతృభాషలో జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ సీసీఎఫ్ (ప్రొడక్షన్) జి.రామలింగంతో పాటుగా టింబర్ మర్చంట్స్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

విద్యార్థులు క్రమశిక్షణను అలవర్చుకోవాలి



నోట్ పుస్తకాలను అందజేస్తున్న వీహెచ్

చాంద్రాయణగుట్ట: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు క్రమశిక్షణను అలవర్చుకొని జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హనుమంత రావు అన్నారు. పాత నగర మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు ఆరే దత్తు ఆధ్వర్యంలో అలియాబాద్‌లోని మున్నూరు కాపు సంఘం కార్యాలయంలో ఆదివారం విద్యార్థులకు నోట్ పుస్తకాలు, మెరిట్ సాధించిన వారికి స్కాలర్‌షిప్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహాత్మా జ్యోతిబాపూలేని ఆదర్శంగా తీసుకొని బీసీలు ముందుకుసాగాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం ప్రతినిధులు పొన్న శ్రీనివాసారావు, పంచజన్యం, పొన్న బాలరాజు, గోవింద్ రాజు, కె.ప్రవీణ్, అల్లం భాస్కర్, ఆనంద్ రావు, కె.రమేష్, అశోక్ కుమార్, పొన్న బాల్‌రాజ్, అడ్వకేట్ రమేష్, ప్రొఫెసర్ ప్రసన్న కుమార్, అడ్వకేట్ ప్రవీణ్ పాల్గొన్నారు.

'చలన కాంక్ష' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అందెశ్రీ, సుద్దాల అశోక్‌తేజ తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఉదయ సాహితీ ఆధ్వర్యంలో ప్రముఖ కవి మౌనశ్రీ మల్లిక్ రచించిన 'చలన కాంక్ష'పుస్తకావిష్కరణ సభ ఆదివారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా లోక కవి అందెశ్రీ మాట్లాడుతూ.. రచయిత సమాజంలోని పలు అంశాలపై చక్కగా వివరించారని కొనియాడారు. సినీగేయ రచయిత డాక్టర్ సుద్దాల అశోక్‌తేజ మాట్లాడుతూ..వెలుగును వెలిగించే ప్రయత్నం చేసే వారే నిజమైన విమర్శకులు అన్నారు. ఏమైనా తప్పులు ఉంటే చెవిలో చెప్పాలి ఏదైనా మంచి ఉంటే నలుగురిలో చెప్పాలి అని తన చిన్నప్పుడు వాళ్ల అమ్మ చెప్పిన విషయాన్ని నేటికీ పాటిస్తున్నట్లు గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో సాహితీవేత్త ద్యాసం సేనాధిపతి, నేటినిజం దినపత్రిక సంపాదకులు బైసా దేవదాస్, ఓయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్.రఘు, కవయిత్రి పద్మకళ, ఉదయ సాహితీ రాష్ట్ర మహిళా కార్యదర్శి మూర్తి శ్రీదేవి పాల్గొన్నారు.

'ఒక చిత్రం ఎన్నో భావాలను పలికిస్తుంది'



గన్‌ఫౌండ్రీ: ఒక చిత్రం ఎన్నో భావాలను పలికిస్తుందని పలువురు వక్తలు అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో పికాసో ది స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో బి హైండ్ ది బ్రష్ చిత్ర కళా ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భాషా సాంస్కృతిక డైరెక్టర్ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ..అద్భుతమైన కళాత్మక చిత్రకళ ప్రదర్శన అని కొనియాడారు. చిత్రకారుల వెనుక ఉన్న సాదక బాదకాలను తెలుపుతూ చిత్రకళా ప్రదర్శన ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సంస్థ వ్యవస్థాపకుడు బైరు రమేష్ మాట్లాడుతూ..ఈ నెల 24వ తేదీ వరకు ఈ చిత్రకళా ప్రదర్శన కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్ బీఎస్.రాములు, రాష్ట్రపతి నిలయం (బొల్లారం) మేనేజర్ డాక్టర్ కె.రజినిప్రియ, మహిళా హక్కుల న్యాయవాది డాక్టర్ శ్రీదేవి, హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ అధ్యక్షుడు ఎంపీ రమణారెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

నాంపల్లి: తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు వర్కల సత్యనారాయణ, కార్యదర్శి ఆర్.మహేందర్ హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. నాల్గవ తరగతి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆమెను వారు కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు నర్సింగ్ పాల్గొన్నారు.

తుల్జాపూర్‌లో తెలంగాణ బోనాల జాతరకు ఏర్పాట్లు

- నాలుగేళ్లుగా నిర్వహిస్తున్న పాతబస్తీ వాసులు
- ఈ నెల 29న బోనాలు.. 30న ఘటం సామూహిక ఊరేగింపు
- 28న పాతబస్తీ నుంచి బయలు దేరనున్న భక్తులు



గతేడాది తుల్జాపూర్‌లో అమ్మవారికి బోనం సమర్పిస్తున్న భక్తులు (ఫైల్)

చార్మినార్: తుల్జాపూర్‌లో తెలంగాణ బోనాల జాతర ఉత్సవాలను రెండు రోజుల పాటు వైభవంగా నిర్వహించడానికి పాతబస్తీలోని ఉత్సవాల నిర్వాహకులు తగిన ఏర్పాట్లు పూర్తి చేశారు. డబీర్‌పురాలోని పంచదుర్గ ఆలయానికి చెందిన కమిటీ ప్రతినిధులు ఇప్పటికే నూతన కమిటీని ఏర్పాటు చేసుకుని ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. నాలుగేళ్లుగా తుల్జాపూర్‌లో అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్నారు. ఈసారి జరిగే ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 29న బోనాలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం వెల్లడించారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 28న డబీర్‌పురా పంచదుర్గమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న వాహనాల్లో అధిక సంఖ్యలో తుల్జాపూర్ బయలుదేరి వెళ్లనున్నామన్నారు.

30న అమ్మవారి సామూహిక ఘటం ఊరేగింపు..

తుల్జాపూర్‌లో అమ్మవారికి బోనాలు సమర్పించిన అనంతరం మరుసటి రోజు భాజాభజంత్రీల నడుమ అమ్మవారి ఘటం సామూహిక ఊరేగింపు నిర్వహించనున్నామని నిర్వాహకులు తెలిపారు. దారిపొడవునా పోతరాజు నృత్యాలతో పాటు కళాకారుల డ్యాన్స్‌లు స్థానిక భక్తులను అలరించనున్నారన్నారు. దత్తు తుల్జాపూర్‌లో అమ్మవారి ఘటం నిమజ్జనం ఉంటుందన్నారు.

నాలుగేళ్లుగా బోనాలను నిర్వహిస్తున్నాం..



నాలుగేళ్లుగా తుల్జాపూర్‌లో తెలంగాణ బోనాలను నిర్వహిస్తున్నాం. భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్న బోనాలతో మేమంతా పిల్లాపాపలతో కష్టాలు లేకుండా సుఖశాంతులతో ఉన్నాం. ఆయురారోగ్యాలతో చల్లంగా ఉంటున్నాం. ఎలాంటి సమస్యలు లేవు. కరోన కష్ట కాలం అనంతరం ఏడాది నుంచి తెలంగాణ బోనాలను తుల్జాపూర్‌లో నిర్వహిస్తున్నాం.

– పింజరోళ్ల ఆనంద్, అధ్యక్షుడు